క్లుప్తంగా

క్రీడాకారిణికి ఆర్థికసాయం



విద్యార్థినికి ఆర్థికసాయం అందిస్తున్న మాజీ కౌన్సిలర్ చందూలాల్, ఉపాధ్యాయులు

భైంసాటౌన్: పట్టణంలోని ఏపీనగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని దోమల రాజేశ్వరి జాతీయస్థాయి వుషూ పోటీలకు ఎంపికైంది. ఈనెల 22 నుంచి 27 వరకు జమ్ముకాశ్మీర్‌లో జరిగే పోటీల్లో పాల్గొనుండగా, ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండడంతో దాతలు ఆర్థికసాయం అందించాలని పాఠశాల హెచ్‌ఎం అడెల్లు కోరారు. ఈమేరకు సోమవారం వార్డు మాజీ కౌన్సిలర్ చందూలాల్, పాఠశాల ఉపాధ్యాయుల సహకారంతో రూ.5500 ఆర్థికసాయం అందించినట్లు పేర్కొన్నారు. క్రీడాకారిణికి దాతలు ఆర్థికసాయం అందించాలని కోరారు. 96035 98264 నంబర్‌కు ఫోన్‌పే /గూగుల్ పే ద్వారా తోచిన సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

శబరిమలకు పాదయాత్ర



స్వాములకు పండ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకుడు జీవన్

ముధోల్: మండల కేంద్రం నుంచి అయ్యప్ప స్వాములు సోమవారం కేరళలోని శబరిమలకు పాదయాత్రగా బయల్దేరి వెళ్లారు. ఈ యాత్ర 41రోజుల పాటు కొనసాగనుంది. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములకు గ్రామస్తులు సాగనంపారు. బీజేపీ నాయకుడు జీవన్ వారికిస్వాములకు అల్పాహారంగా పండ్లు పంపిణీ చేశాడు. నాయకులు మోహన్, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

భక్తి మార్గం వైపు పయనించాలి



పూజలు చేస్తున్న స్వాధ్యాయ పరివార్ భక్తులు

కుంటాల: ప్రతి ఒక్కరూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండి భక్తిమార్గం వైపు పయనించాలని స్వాధ్యాయ పరివార్ వక్తలు పేర్కొన్నారు. కుంటాలలోని ఉమామహేశ్వర ఆలయంలో సోమవారం పూజలు అనంతరం భక్తులకు ప్రవచనాలు అందించారు. సామాజిక మార్పు కోసం భగవద్గీత, వేదాల సందేశాన్ని ఇంటింటా ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పరివార్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నోటుబుక్‌లు, పెన్నులు పంపిణీ

బాసర: బాసరలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా కమిటీ సభ్యులు సోమవారం ఉచితంగా నోటుబుక్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. అంతకుముందు కమిటీ సభ్యులు బాసర సరస్వతి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. హెచ్‌ఎం శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు సంతోష్ రావు, అధ్యక్షుడు భీంరావు, ఉపాధ్యక్షుడు మాధవ్, ప్రధాన కార్యదర్శి గౌతమ్, కోశాధికారి ఆనంద్. సలహాదారులు హనుమంతరావు, సలహాదారులు ధర్మారావు, సభ్యులు రాములు, సుధాకర్‌రావు, సంతోష్, జాదవ్ సంజీవ్, ప్రకాశ్, నాగేష్, పవన్ కుమార్, రామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

నిర్మల్‌ఖిల్లా: జిల్లాకేంద్రంలోని స్థానిక వినాయకనగర్ కాలనీ అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జుట్టు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా జోగు మోహన్, ఉపాధ్యక్షుడిగా కె.నర్సారెడ్డి, సంయుక్త కార్యదర్శిగా జి.రాంచందర్, కోశాధికారిగా ఈ.శ్యాంసుందర్‌రెడ్డి, సహాయ కోశాధికారిగా ఎల్.భీమ్‌రెడ్డి ఎన్నికయ్యారు. ప్రధాన సలహాదారులుగా తిరుపతిరెడ్డి, రవీందర్, గంగాధర్, శేఖర్‌రెడ్డి, అంజిరెడ్డి ఎన్నికయ్యారు.

జిల్లా మహాసభల హాజరుకు అనుమతినివ్వాలి

లోకేశ్వరం: ఖానాపూర్‌లో ఈనెల 14న నిర్వహించే జిల్లా మహాసభల హాజరయ్యేందుకు అనుమతిని ఇవ్వాలని మెడికల్ అధికారికి మండల ఆశవర్కర్లు సోమవారం వినతిపత్రం అందజేశారు. సంఘం అధ్యక్షురాలు ఆనందకుమారి, ఆశ వర్కర్లు ఉన్నారు.

యాసంగికి నీరందేనా..

- అధ్వానంగా గడ్డెన్న వాగు ప్రాజెక్టు కాలువలు
- తాగునీటికి పరిమితమైన ప్రాజెక్టు
- పూడుకుపోయిన ఉప కాలువలు



గడ్డెన్న వాగు ప్రాజెక్టు

భైంసా/భైంసారూరల్: పట్టణ సమీపంలో నిర్మించిన గడ్డెన్నవాగు నీరు యాసంగి పంటలకు అందుతుందనేది అనుమానంగానే ఉంది. భారీ వర్షాలతో ఉపకాలువలు కోతకు గురయ్యాయి. ప్రధాన కాలువలు దెబ్బతిన్నాయి. వాలేగాం గ్రామం వద్ద అక్విడెక్ట్ లీకేజీలతో కనిపిస్తోంది. ఈ ఏడాది భారీ వర్షాలతో ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం ఉంది. ఉపకాలువలు మరమ్మతు చేస్తే పంట పొలాలకు నీరందనుంది.

రెండు మండలాల్లో..

గడ్డెన్న వాగు ప్రాజెక్టు 1.83 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. ఎనిమిది వరద గేట్లు బిగించి 41 కిలోమీటర్ల మేర ప్రధాన కాలువ ఏర్పాటు చేశారు. భైంసా నుంచి లోకేశ్వరం వరకు 40 కి.మీ మేర ప్రధాన కాలువ రెండు మండలాల్లోని ఆయా గ్రామాల చెరువులు నింపుతూ ఉప కాలువలతో పంట పొలాలకు నీరందించేలా రూపొందించారు. ఉప కాలువలన్నీ మూసుకుపోయిన అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ప్రధాన కాలువలో మోటార్లు పెట్టి నీటిని తరలిస్తున్నారు. కాలువకు అనుకుని ఉన్న భూములకే ప్రాజెక్టు నీరు అందుతోంది. చివరి భూములకు మూసుకుపోయిన ఉప కాలువలతో నీరందే పరిస్థితి లేదు. ఈ ప్రాజెక్టు కింద 14 వేల ఎకరాలకు సాగునీరందుతుందని చెబుతున్నారే తప్ప ఇప్పటివరకై తే పూర్తిస్థాయిలో అందించలేదు.

ఉన్న నీరైనా అందిస్తే..

ఈ ఏడాది మహారాష్ట్రలో భారీ వర్షాలు కురిశాయి. వరద నీరంతా గడ్డెన్న వాగు ప్రాజెక్టులోకి చేరింది. ఎనిమిది గేట్లు ఎత్తి బయటకు వదిలేశారు. ప్రాజెక్టుకు 13 టీఎంసీల ఇన్‌ఫ్లో చేరింది. ఇందులో 11.50 టీఎంసీల నీరు ఇప్పటివరకు గేట్లు ఎత్తి బయటకు పంపించారు. ప్రస్తుతం 1.702 టీఎంసీల నిల్వ ఉంది. ప్రాజెక్టు సామర్థ్యం చిన్నది కావడంతో నీటిని ఎప్పటికప్పుడు వదిలేస్తున్నారు. ఉన్న నీరైనా ఆయకట్టు రైతులకు అందిస్తే యాసంగిలో పంటలు పండుతాయి. భారీ వర్షాలతో మరోవైపు గడ్డెన్నవాగు వరద గేట్లు ఎత్తడంతో పరీవాహక ప్రాంతంలో నీటి ఉధృతికి వేల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ఈ రైతులకైతే ఇప్పటికీ పరిహారం అందలేదు. ఇక ప్రాజెక్టులో ఉన్న నీటిని ఉప కాలువలకు మరమ్మతు చేసి చివరి రైతులకు అందించేలా అధికారులు దృష్టిపెట్టాలని పలువురు కోరుతున్నారు.

ఆయకట్టు రైతులకు నీరందిస్తాం

ప్రాజెక్టు కింద 13,950 ఎకరాలకు సాగునీరు అందుతుంది. యాసంగిలో ప్రధాన కాలువ ద్వారా నీరందిస్తాం. ఆయకట్టు రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. భైంసా, లోకేశ్వరం మండలాల్లోని ప్రాజెక్టు పరిధిలో ఉన్న ఆయకట్టు రైతులకు నీరందించే విషయంపై ప్రత్యేక దృష్టిసారిస్తాం.

– అనిల్, గడ్డెన్నవాగు ప్రాజెక్టు డీఈఈ

ఐదు తరగతులకు ఒకే టీచర్..

- ఇదీ వట్టోలి పాఠశాల దుస్థితి
- శిథిలావస్థకు చేరిన భవనం
- ఇబ్బందుల్లో విద్యార్థులు



బోధిస్తున్న ఉపాధ్యాయుడు మేడాజీ మురళీధర్

లోకేశ్వరం: ఆ పాఠశాలలో ఐదు తరగతులకు 29 మంది విద్యార్థులు ఉండగా ఒకే ఉపాధ్యాయుడు ఉన్నాడు. ఇదీ మండలంలోని వట్టోలి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల దుస్థితి. బడిబాట కార్యక్రమంలో భాగంగా బడి బయట ఉన్న పిల్లలను పాఠశాలలో చేర్పించి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. సరిపడా తరగతి గదులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో పాఠశాల భవనం పైకప్పు ఊరుస్తోంది. ఐదు తరగతులకు రెండు గదులు ఉన్నాయి. గదులు సరిపోక విద్యార్థులు ఆరు బయట చదువులు సాగించాల్సిన పరిస్థితి. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. ఓ గదిలో వంట చేస్తున్నారు. పాఠశాల పక్కన నీటికుంట ఉంది. పాములు, తేళ్లు వస్తుండడంతో విద్యార్థులు భయందోళనకు గురవుతున్నారు. పాఠశాల చుట్టూ ప్రహరీ లేకపోవడంతో పశువులు సంచరిస్తున్నాయి. పాఠశాల ఆవరణ అధ్వానంగా మారుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి పాఠశాలల్లో మౌలికవసతులు కల్పనపై దృష్టిసారించాలని విద్యార్థులు కోరుతున్నారు.

నిధులు మంజూరైతే..

మండలంలోని ఆయా పాఠశాలలకు మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తాం. ప్రభుత్వ నిధులు మంజూరు చేస్తే పాఠశాల భవన మరమ్మతు చేపడుతాం. అదనపు తరగతి గదులు, వంట గది నిర్మిస్తాం.

– చంద్రకాంత్, ఎంఈవో, లోకేశ్వరం

ఇబ్బందిగా ఉంది



వర్షం పడితే ఇబ్బందిగా ఉంది. ఒకే గదిలో కూర్చోవడంతో అల్లరి ఎక్కువ అవుతుంది. పాఠాలు అర్థం కావడం లేదు. చిన్న చినుకు పడితే చాలు ఊరుస్తుంది.

– శృతి, ఐదో తరగతి

వసతులు కల్పించాలి



పాఠశాలల్లో సరైన వసతులు లేవు. తరగతి గది లేక ఇబ్బంది అవుతుంది. పాఠశాల చుట్టూ ప్రహరీ లేదు. పశువులు ఆవరణలోకి వస్తున్నాయి. మౌలిక వసతులు కల్పించాలి.

– సుచరిత, నాలుగవ తరగతి

సోయా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సభ్యులు

లక్ష్మణచాంద: మండలంలో సోయా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో తహసీల్దార్, ఏవో కార్యాలయాల ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా సభ్యుడు సాగర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గోదావరి పరీవాహక గ్రామాల్లో పంటలు తీవ్రంగా నష్టపోయినట్లు తెలిపారు. రైతులకు పరిహారం చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. దీంతో రైతులు దళారులకు తక్కువ ధరకు సోయా, మొక్కజొన్నలు విక్రయిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సోయా, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని లేకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల కార్యవర్గ సభ్యులు పుణ్యమూర్తి కృష్ణ, సంత మధుకర్, ఏలేటి కిరణ్‌రెడ్డి, కొమ్ముల విష్ణురెడ్డి, ఏనుగు ప్రసాద్, గంగారెడ్డి, శ్రీనివాస్, సిలారి రాము, బొమ్మెన మధు, చిన్న మల్లేశ్, ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

- కలెక్టర్ అభిలాష అభినవ్



వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న అధికారులు

కుంటాల: భూభారతి కార్యక్రమంలో భాగంగా భూ సమస్యలు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. సోమవారం కుంటాల మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఇందిరమ్మ ఇల్లు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, కుల, ఆదాయ నివాస ధ్రువీకరణ పత్రాలను వెంటనే అందించాలని కోరారు. తహసీల్దార్ కమల్‌సింగ్, ఎంపీడీవో అల్లాడి వనజ, ఎంపీవో ఎంఏ రహీంఖాన్, ఏపీఎం లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భీమన్న జాతర



కోలాటం ఆడుతున్న భక్తులు

మామడ: మండలంలోని కొరిటికల్ గ్రామంలో భీమన్న ఆలయం జాతర ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను గోదావరి నదిలో స్నానమాచరింపజేసిన అనంతరం భక్తులు ఆలయానికి చేరుకున్నారు. దేవతల కల్యాణం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి వీక్షించారు. భక్తుల కోలాటం, భజనలతో ఆలయ ఆవరణ మార్మోగింది. జాతర సందర్భంగా మిఠాయిలు, ఆటవస్తువుల దుకాణాలు వెలిశాయి.

అధికారులపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న హ్యూమన్ రైట్స్ సభ్యులు

నర్సాపూర్(జి): నర్సాపూర్ (జి) పంచాయతీకి సంబంధించిన స్వచ్ఛభారత్ మిషన్ (ఎస్‌బీఎం) నిధులు దుర్వినియోగం చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయమై నేషనల్ రైట్స్ మూమెంట్ హ్యూమన్ రైట్స్ కమిషన్ సభ్యులు సోమవారం ప్రజావాణిలో తహసీల్దార్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. నర్సాపూర్(జి), రాంపూర్, కుస్లీ, అంజనీతండా, టెంబుర్ని, గొల్లమాడ, తిమ్మాపూర్ (జి) గ్రామాల ఎస్‌బీఎం నిధులు 2023 నుంచి 2025 మార్చి వరకు సమగ్ర వివరాలు తెలపాలని వినతిలో కోరారు. నిధుల దుర్వినియోగానికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సభ్యులు ఇమ్రాన్, ఇర్ఫాన్, షరీఫ్, సోహెల్, ఫైసల్, జమీల్షా, షఫీ తదితరులు ఉన్నారు.

వరి పంటలు పరిశీలన



పరిశీలిస్తున్న ఏవో వినోద్‌కుమార్

సోన్: మండల కేంద్రంలో సోమవారం వరి పంటలను ఏవో వినోద్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటలో సోకే సుడిదోమలు గోధుమ, తెలుపు రంగులో ఉంటాయన్నారు. మొక్క మొదళ్లలో గుంపులుగా చేరి రసం పీలుస్తుందన్నారు. దీని నివారణకు పైమెట్రోజెన్ 0.60 గ్రాములు లేదా ట్రై ఫ్లూమెజాపైరం 0.485 గ్రాములు, బుప్రొఫెజెన్ 1.6 మిల్లి ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. రైతులు బుచ్చన్న, శ్రవణ్ తదితరులు ఉన్నారు.

ఎంబీబీఎస్‌లో సీటు

కుంటాల: మండలంలోని కల్లూరు వాసవి ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థిని హరిణి ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. విద్యార్థిని సోమవారం పాఠశాలలోని ఉపాధ్యాయులు సన్మానించి అభినందించారు. ప్రిన్సిపాళ్లు సాయిలు, గట్టుపల్లి శ్రీనివాస్, సంతోష్, డైరెక్టర్లు జానకిరామ్, కదార్ల హరిప్రసాద్ తదితరులు ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

ఖానాపూర్: మండలంలోని సత్తన్‌పల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐదు మెగావోల్ట్‌ల పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం విద్యుత్‌శాఖ ఆపరేషన్స్ ఎస్సీ సాలియా నాయక్ ప్రారంభించారు. సత్తన్‌పల్లిలోని 3.15 మెగావోల్ట్ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌కు అధిక లోడ్ తగ్గించడంతోపాటు వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్, సమ్మర్ యాక్షన్‌ప్లాన్‌లో భాగంగా వీటిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈ నాగరాజు, ఎంఆర్‌టీ డీఈ హరిచంద్, ఏఈ రాసింగ్ పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలో ప్రతిభ

దస్తురాబాద్: మండలంలోని మున్యాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి జి.సాయి జోనల్ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. లక్ష్మణచాంద మండలంలోని వడ్యాల్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన అండర్–14 బాలుర కబడ్డీ ఎస్‌జీఎఫ్ పోటీల్లో ప్రతిభ కనబర్చాడు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు జె.నవీన్, హెచ్‌ఎం వామన్‌రావ్ అతన్ని అభినందించారు.

ఇసుక ట్రాక్టర్‌కు జరిమానా

నర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లి చెరువు అలుగు పక్క నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని సమాచారంతో ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి అప్పగించారు. ట్రాక్టర్ యాజమానికి రూ.2500 జరిమానా విధించినట్లు తహసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

చేనే పంట కల్లం..!



కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో పంట కల్లాలు లేక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో చేసేదేమీ లేక పొలాల్లోనే ఉత్పత్తులను ఆరబెడుతున్నారు. రైతులకు అవగాహన కల్పించి పంట కల్లాల నిర్మాణానికి ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైన ఉంది.

పట్టపగలే వెలుగులు



జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న సెంట్రల్ లైటింగ్ పట్టపగలే వెలుగుతున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రధాన రహదారిపై వెళ్లే వాహనదారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పట్టపగలు విద్యుత్ వృథా కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

కల్వర్టు స్లాబ్‌కు రంధ్రం



లోకేశ్వరం: మండలంలోని వట్టోలి గ్రామంలోని మురుగుకాల్వపై కల్వర్టు నిర్మించి స్లాబ్ వేశారు. స్లాబ్ శిథిలావస్థకు చేరి పెద్ద రంధ్రం ఏర్పడింది. ఈ మార్గం గుండా వెళ్లే ప్రజలు అదమరిస్తే ప్రమాదం బారినపడే అవకాశం ఉంది. అధికారులు స్పందించి స్లాబ్‌కు మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చిన్నారులకు పోషకాహారం అందించాలి



వడ్యాల్‌లో మాట్లాడుతున్న సీడీపీవో నాగలక్ష్మి

లక్ష్మణచాంద: చిన్నారులకు పోషకాహారం అందించాలని నిర్మల్ సీడీపీవో నాగలక్ష్మి అన్నారు. మండలంలోని వడ్యాల్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ అభియాన్–పోషణమాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులు మానసికంగా, శారీరకంగా దృఢంగా అయ్యేందుకు పోషకాహారం ఇవ్వాలన్నారు. అనంతరం పోషక విలువలు గల ఆహార పదార్థాలను ప్రదర్శించారు. పలువురు చిన్నారులకు అన్నప్రాసన–అక్షరభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో మానస, సూపర్‌వైజర్ భాగ్యవతి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

తానూరు: చిన్నారులకు బలవర్ధక పోషకాహారం అందించాలని ఐసీడీఎస్ సీడీపీవో సరోజని పేర్కొన్నారు. మండల కేంద్రంలోని 4వ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం నిర్వహించిన పోషణ్‌మాస వారోత్సవంలో మాట్లాడారు. పిల్లలకు పాలు, గుడ్లు, పండ్లు, ఆకుకూరలు, కూరగాయాలు, పప్పుదినుసులు లాంటి బలవర్ధకమైన ఆహారాన్ని అందించాలని పోషకులకు సూచించారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రక్తహీనతపై అవగాహన కల్పించారు. అన్ని గ్రామాల్లో ఈనెల 16వ తేదీ వరకు పోషణమాస వారోత్సవాల కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమా, బీసీ కోఆర్డినేటర్ రోజా, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని ఇంద్రనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ అభియాన్‌లో భాగంగా గర్భిణి, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్ పుష్పలత, ఇంద్రనగర్ పాఠశాల హెచ్‌ఎం షరీఫా, హెల్పర్ గంగమ్మ, కాలనీవాసులు ఉన్నారు.

తాళ సప్తాహం ప్రారంభం

కుభీర్: మండలంలోని పార్డి(కె) గ్రామంలోని హనుమాన్ మందిరంలో సోమవారం తాళ సప్తాహం ప్రారంభమైంది. ప్రతిఏటా దీపావళికి ముందు ఇక్కడ ఏడు రోజుల సప్తాహం జరగడం అనవాయితీగా వస్తోంది. ఈనెల 20న జాతర, అన్నదానం నిర్వహించనున్నారు. ఈ ఏడురోజులు భజనలు, కీర్తనలు, సాధుసంతుల ప్రవచనాలు ఉంటాయి. ఆలయ కమిటీ చైర్మన్ సాయినాథ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

హెల్మెట్లు ధరించాలి

బాసర: బాసర ఆర్జీయూకేటీలో సర్వేజన ఫౌండేషన్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో రోడ్డు భద్రత పౌరుల విధి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకురాలు శాంతి జగదీశ్వరి మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్లు ధరించాలన్నారు. కార్లు నడిపేవాళ్లు తప్పకుండా సీట్‌బెల్ట్ పెట్టుకోవాలన్నారు. సివిల్ ఇంజనీరింగ్ అధ్యాపకులు, ఇంజనీరింగ్ మూడో సంవత్సరం విద్యార్థులు, ల్యాబ్ స్టాఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

ముధోల్: సమస్యల పరిష్కారానికే ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీలత తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలపై రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే పరిష్కరిస్తామని తెలిపారు. ఎంపీడీవో శివకుమార్, ఈవో అన్వర్‌అలీ, ఏపీఎం గురుచరణ్‌తో పాటు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నిర్మల్‌టౌన్: జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో గుర్తుతెలియని వ్యక్తి చికిత్సపొందుతూ మృతిచెందాడు. పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..ఈనెల 8న అనారోగ్యంతో సదరు వ్యక్తి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడు. సోమవారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి చేతిపై ×మామ్ డాడ్×అని పచ్చబొట్టు రాసి ఉంది. ఇతడి వివరాలు తెలిస్తే పట్టణ పోలీసుస్టేషన్‌లో సమాచారం అందించాలని కోరారు.